43)కురంజి

ప||　తొల్లింటి వలె గావు తుమ్మెదా యింక | వొల్లవుగా మమ్ము వో తుమ్మెదా ||

చ||　తోరంపు రచనల తుమ్మెదా కడు | దూరేవు గొందులే తుమ్మెదా |
దూరినా నెఱుగవు తుమ్మెదా మమ్ము | వోరగా చూడకు వో తుమ్మెదా ||

చ||　తొలి ప్రాయపు మిండ తుమ్మెదా కడు | తొలిచేవు చేగలే తుమ్మెదా |
తొలకరి మెరుగువే తుమ్మెదా ఇంక | ఉలికేవు మముగని వో తుమ్మెదా ||

చ||　దొరవు వేంకటగిరి తుమ్మెదా మా | తురుమేల చెనకేవు తుమ్మెదా |
దొరకెనీ చనవులు తుమ్మెదా ఇంక | ఒరులెఱింగిరి గదవో తుమ్మెదా ||